ప్రజాశక్తి
శనివారం 24 ఫిబ్రవరి 2024 5 విజయనగరం



5,186 ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పేదల పేరిట రిజిస్టర్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పంపిణీ చేశారు. ఒంగోలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శుక్రవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సుమారు 25 వేల మంది పేదలకు రిజిస్టర్ పట్టాలను సిఎం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ నాగలక్ష్మి రిజిస్టర్ పట్టాలను అందజేశారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రెండో విడత కింద సారిక ఎపిసిడి లేఅవుట్లలో 3,403 మందికి, జమ్ము నారాయణపురంలో 1053 మందికి, 90 రోజుల కార్యక్రమం కింద గుంకలాం లేఅవుట్లో 730 మందికి... మొత్తం 5,186 మందికి పట్టాలు పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, డిఇలు, ఏఇలు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా

కార్మిక సంఘాల నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీ సరిహద్దులో పోరాటం చేస్తున్న రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన జిల్లాలో పలుచోట్ల శుక్రవారం నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రైతులు పోరాడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి భాష్పవాయు, నీటి ఫిరంగులతో దాడికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీస్ కాల్పుల్లో యువరైతు సుభకరణ్ సింగ్ మరణించడాన్ని తీవ్రంగా ఖండించారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీ కేంద్రంగా పెద్ద ఎత్తున రైతులు ఆందోళన చేస్తుంటే, రోడ్లపై మేకుల కొట్టి, ప్రహరీల కట్టి, పోలీసులను అడ్డం పెట్టుకుని కాల్పులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రైతులతో చర్చించి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంటల గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బుచ్చయ్య, సింహాచలం, వెంకటేష్, రాంబాబు, రవి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస.. నిరసన తెలుపుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యకాస నాయకులు

శృంగవరపుకోట : రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన శృంగవరపుకోట పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తానని హామి ఇచ్చి గద్దెనెక్కి తరువాత ఆ హామీని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాటం చేస్తే, కాల్పులకు తెగబడటం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వ దుర్మార్గపు వైఖరిని ప్రజలు, కార్మికులు, రైతులు, మేధావులు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చెలికాని ముత్యాలు, ఎర్రప్రగడ భాస్కర్ రావు, పోకల భాస్కరరావు, అనుబంధం సంఘ నాయకులు ఎన్.సంతోష్, కె.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : రైతులపై కాల్పులకు వ్యతిరేకంగా మండలంలోని కర్రిచిన్నయ్యపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు మాట్లాడుతూ పోలీసు కాల్పుల్లో యువ రైతు మృతి చెందడాన్ని, అక్కడి పోలీస్ తీరును ఎండగట్టారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరించిన తీరు ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమణ, రాము, లక్ష్మి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం, శృంగవరపుకోటలో రాస్తారోకోలు చేపడుతున్న కార్మిక సంఘాల నాయకులు

రైతులేమైనా ఇంజినీర్లా?

- కాలువ అలైన్‌మెంట్ మార్పుచేయం
- సాగునీటి కోసం భూములు త్యాగం చేయక తప్పదు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్పు చేయాల్సిన అవసరం లేదు... మార్పుచేయాలని చెప్పడానికి రైతులేమైనా ఇంజినీర్లా?. నీరు ఎలా వెళ్లాలో... కాలువ ఎలా నిర్మించాలో ఇంజినీర్లకు తెలుస్తుంది. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం చేసినప్పుడు భూములు త్యాగం చేయక తప్పదు.. అలా అయితే కదా పంట భూములకు సాగునీరు అందేది'... అంటూ జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తేల్చిచెప్పారు. జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వైసిపి హయాంలోనూ, అంతకు ముందు మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాత్రమే జరిగాయని తెలిపారు. టిడిపి ఏమీ చేయకపోయినా ప్రాజెక్టులు నిర్మించినట్టుగా గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. ఈ సందర్భంగా సుజల స్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్పుచేయాలంటూ రైతులు చేస్తున్న ఆందోళనపై వైసిపి వైఖరి ఏమిటని 'ప్రజాశక్తి' ప్రశ్నించగా 'రైతులేమైనా ఇంజినీర్లా..?' అని ప్రశ్నించారు. ప్రాజెక్టులు చేపట్టినప్పుడు భూములు సేకరించడం సహజమని, అందుకు రైతులు సహకరించాల్సి ఉంటుందని చెప్పారు. సుజల స్రవంతి కాలువ నిర్మాణంలో తమ పార్టీకి చెందిన నెక్కల నాయుడుబాబు స్వగ్రామంలోని భూములు కూడా పోతున్నాయన్నారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించామని 'ప్రజాశక్తి' అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉత్తరాంధ్రలో ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి పచ్చ మీడియాకు కనిపించదా? అంటూ ఓ పత్రికనుద్దేశించి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విత్తనాల విక్రయం మొదలుకుని, పంట కొనుగోలు వరకు గతంలో ఎన్నడూ లేని విధంగా సాగుతోందన్నారు. ఈ ఏడాది మునుపెన్నడూ లేనంగా ధాన్యం సేకరించడంతోపాటు చెల్లింపులు జరిగాయన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

సెపక్ తక్రా జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లూరు జిల్లాలో శనివారం నుంచి జరిగే సబ్ జూనియర్, జూనియర్ బాల, బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక పూర్తయింది. ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం రాత్రి నెల్లూరు పయనమయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు ఆకాంక్షించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ రోటరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌కె డిగ్రీ కళాశాల లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు వి.వి.రాజేష్ ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా సేకరించిన 70 యూనిట్ల రక్తాన్ని రోటరీ, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకులకు అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆర్.శంకర్ రెడ్డి, క్లబ్ పాస్ట్ గవర్నర్ ఎం.రామారావు, బి.అశోక్, ఎం.అశోక్, న్యాయవాది జయకృష్ణ, కె.ఆర్.కె.రాజు, జగదీష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-2 పరీక్షలు

- 80 కేంద్రాలు.. 26,452 మంది అభ్యర్థులు
- విజయవంతంగా నిర్వహించాలి : డిఆర్ఓ అనిత

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ అనిత

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 25న జరిగే గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి అనిత తెలిపారు. జిల్లాలో 80 కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. 80 కేంద్రాలకు గాను 24 రూట్లుగా విభజించి 24 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేసి, పరీక్షా నిర్వహణ, నిబంధనలపై డిఆర్ఓ అవగాహన కల్పించారు. రూట్ అధికారులు ముందు రోజే వారి రూట్లను తనిఖీ చేసుకోవాలని తెలిపారు. పరీక్షా పత్రాలు తీసుకున్న దగ్గర నుండి జవాబు పత్రాలను సబ్‌మిట్ చేసే వరకూ చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పేపర్లు తీసుకునేటప్పుడు వెన్యూ కోడ్ సరి చూసుకోవాలని, పరీక్షకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదువుకోవాలని తెలిపారు. లైజన్ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు ఉండేలా ఏర్పాట్లను చేయాలన్నారు. ఉదయం 9.30 గంటల తర్వాత మెయిన్ గేట్లు మూసివేయాలని, పరీక్ష పూర్తయ్యాక 1 గంటకే అభ్యర్థులను బయటకు విడిచిపెట్టాలని సూచించారు. పరీక్ష హాల్లో ప్రతి రూమ్ వద్ద అభ్యర్థుల నంబర్లను డిస్‌ప్లే చేయాలని చెప్పారు. వికలాంగులకు, గర్భిణులకు వీలున్నంతవరకు గ్రౌండ్ ఫ్లోర్ లోనే ఏర్పాటు చేయాలన్నారు.

ఎపిపిఎస్‌సి సభ్యులు శంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 899 పోస్టుల కోసం 4,83,525 మంది అభ్యర్థులు గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, సిబ్బందికి గానీ, అభ్యర్థులకు గానీ సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ సెక్రటరీ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన గ్రామీణ బ్యాంకులు

- నిలిచిన రూ.10 కోట్ల లావాదేవీలు
- 43 బ్యాంకులను ఒకే కూటమిగా చేయాలి
- ఎపిజివిబి ఒఎ, ఇయు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నిటిని కలిపి నేషనల్ రీజనల్ రూరల్ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణికుమార్ సుదర్శన్, రీజనల్ సెక్రెటరీ అంబటి దుర్గా డిమాండ్ చేశారు. ఎఐఆర్‌ఆర్‌బిఇఎ పిలుపు మేరకు ఎపిజివిబిఒఎ, ఇయు ఆధ్వర్యాన శుక్రవారం ల్లా వ్యాప్తంగా గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు నిరసనలు చేపట్టారు. దీంతో జిల్లాలోని 52 ఎపిజివిబి బ్రాంచులు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి.

నగరంలో ఎస్‌పి బంగ్లా వద్దనున్న ఎపిజివిబి బ్రాంచి వద్ద ఎపిజివిబిఒఎ, ఇయు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకులపై స్పాన్సర్స్ బ్యాంకుల ఆధిపత్య ధోరణిని అరికట్టాలన్నారు. ఏళ్ల నుంచి బ్యాంకుల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 30 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెన్షన్ విధానాన్ని అన్ని స్పాన్సర్స్ బ్యాంకుల్లో ఉన్నట్టే గ్రామీణ బ్యాంకులకు వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. గ్రాడ్యుటీ, లీవ్ రూల్స్, ప్రమోషన్ రూల్స్‌ని క్రమబద్ధీకరించాలన్నారు.

నిరసన చేపడుతున్న గ్రామీణ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

ఎంఇఒ-2 అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండల విద్యా శాఖ అధికారులు-2 సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. కలెక్టరేట్ ఆడిటోడియంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా వై.దుర్గారావు, అధ్యక్ష, కార్యదర్శులుగా జి.వాసు, ఇ.విజయ్‌కుమార్, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఆర్.పెంటయ్య, రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా పి.సత్యవతి, బి.చంద్రమౌళి ఎన్నికయ్యారు.

27న జాబ్‌మేళా

విజయనగరంకోట : వివిధ కంపెనీల్లో 119 ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీవత్స ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పాపులర్ షూమార్ట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలిపారు. శ్రీవత్సలో ఫీల్డ్ అసిస్టెంట్-100, టీమ్ లీడర్స్-5, ఆఫీసు అసిస్టెంట్-2 పోస్టులు, పాపులర్ షూమార్ట్‌లో సేల్స్-12 ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 8919378915 నంబరును సంప్రదించాలని అరుణ సూచించారు.

ఆలిండియా పోర్ట్ ట్రస్ట్ కబడ్డీ పోటీలకు

ముగ్గురు పీడీలు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆలిండియా పోర్ట్ ట్రస్ట్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బొమ్మాన రామారావు, ఎఎంఎల్ కమలనాభరావు, ఎస్.సూర్యారావు ఎంపికయ్యారు. మూడు రోజులపాటు విశాఖపట్నం పోర్ట్‌లో జరిగే జాతీయ పోటీలకు రిఫరీలుగా వ్యవహరించనున్నారు. జాతీయ స్థాయి రిఫర్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే పోర్ట్ ట్రస్ట్‌లో రిఫరీలుగా అవకాశం వస్తుంది. అటువంటి అవకాశం తమకు లభించడం పట్ల ముగ్గురు పీడీలు ఆనందం వ్యక్తంచేశారు.

25న సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు విశాఖపట్నంలో అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్ జరగనుంది. అందులో పాల్గొనే విజయనగరం జిల్లా పురుషుల కబడ్డీ జట్టును ఈ నెల 25న నగరంలోని సిటీ క్లబ్ ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కెవి ప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు 85 కేజీలలోపు బరువు ఉండాలని, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

సబ్ జూనియర్ బాక్సింగ్ జట్లు...

విజయనగరం జిల్లా సబ్ జూనియర్ బాక్సింగ్ బాలబాలికల జట్ల ఎంపికను ఈ నెల 25న స్థానిక రాజీవ్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.మన్మథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డుతోపాటు వయసు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు. వివరాలకు బి.ఈశ్వరరావు - 9908353698ను సంప్రదించాలని కోరారు.

ఐసిఎం బృందంతో చర్చిస్తున్న డిసిఎంఎస్ చైర్‌పర్సన్ భావన

డిసిఎంఎస్ వ్యాపారాభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిసిఎంఎస్ రానున్న రోజుల్లో తన వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేస్తుంది. ఈ మేరకు శుక్రవారం విజయనగరం డిసిఎంఎస్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అవనాపు భావన అధ్యక్షతన ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్మెంట్ (ఐసిఎం) శిక్షణ సంస్థకు చెందిన బిజినెస్ ఎనలిస్టు రామన్, సంస్థ పీడీ శ్యామ్‌కుమార్, డిసిఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ సభ్యులు, బిజినెస్ మేనేజర్ సాయికుమార్ బృందం సమావేశమయ్యారు. రైతులకు డిసిఎంఎస్ అండగా నిలిచేందుకు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, చిరుధాన్యాల మార్కెటింగ్‌కి సంబంధించి ఈ సమావేశంలో ప్రతిపాదనలు తయారు చేశారు. రాగి ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు, జనఔషధి పేరిట పేద ప్రజలకు తక్కువ ధరలకే మందులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు, జిల్లాలోని బొబ్బిలి, విజయనగరంలో డిసిఎంఎస్ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాన్ని చేపట్టేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా నిధులు సమకూర్చుకుని, ముందుకు సాగేందుకు అవసరమైన ప్రతిపాదనలు డిసిఎంఎస్ సిద్ధం చేసింది.

ఐసిఎం బృందం ముందుగా జిల్లాలో డిసిఎంఎస్‌లో జరుగుతున్న వ్యాపార లావాదేవీలను, అన్నదాతలకు అందిస్తున్న సహకారాన్ని పరిశీలించింది. రాష్ట్రంలో విజయనగరం డిసిఎంఎస్ ఆదర్శంగా నిలుస్తోందని చెప్పడంతోపాటు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో డిసిఎంఎస్ వ్యాపార అభివృద్ధిని అభినందించారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌ఛార్జి కమిటి సభ్యులు శ్రీరాములు నాయుడు, సన్యాసినాయుడు, బాలి బంగారునాయుడు, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 1897 పోలింగ్ కేంద్రాలు

రెండు కౌంటింగ్ సెంటర్లు : కలెక్టర్

విజయనగరం : జిల్లాలో మొత్తం 1897 పోలింగ్ కేంద్రాలు, రెండు కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సిఇఒ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1847, సాలూరు నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలంలో 50.. మొత్తం 1897 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఓట్ల లెక్కింపు కోసం లెండి ఇంజనీరింగ్ కళాశాల, సెంచూరియన్ విశ్వవిద్యాలయ భవనాలను పరిశీలించి, ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఫారం- 6,7,8 పురోగతిని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి

బ్రాహ్మణులకు తీవ్ర అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి-విజయనగరంకోట

బ్రాహ్మణులకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో 'బాబు చెంతకి - బ్రహ్మ(ణ)స్త్రం', బాధిత బ్రాహ్మణుల విముక్తికి జనసేనతో సన్నద్ధం అనే కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం స్థానిక అశోక్ బంగ్లాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలో బ్రాహ్మణులకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుది అన్నారు. బ్రాహ్మణ సాధికార కమిటీ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగంటి రాకేష్ శర్మ, బ్రాహ్మణ సంఘ నాయకులు పేరి రామయ్య మాట్లాడుతూ 2017లో అశోక్ గజపతిరాజు 1200 గజాలు కేటాయించి, బ్రాహ్మణ పరుశురాం భవనాన్ని ఏర్పాటు చేయాలని చూస్తే, నేడు స్థానిక కార్పొరేటర్లు కబ్జా చేయడానికి చూస్తున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, బిసి సెల్ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, అవనాపు విజయ్, పిల్లా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ఆదాయంపై అలక్ష్యం?

- 50 శాతం దాటని పన్నుల వసూలు?
- రావాల్సింది రూ.39 కోట్లు.. వసూలు రూ.17 కోట్లు
- నెల రోజుల్లో వంద శాతం సాధ్యమేనా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధికి కీలకం.. నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం. ఆస్తి పన్ను, నీటి పన్ను, ప్రచార పన్ను వంటి వివిధ రూపాల్లో వచ్చే ఆదాయమిది. అటువంటి ఆదాయం వసూలు చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తుంది. పన్నుల వసూలు కోసం ప్రత్యేకంగా నగర పాలక సంస్థలో రెవెన్యూ విభాగం, అధికారి, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు ఉన్నారు. వీరితో పాటు మూడేళ్లుగా సచివాలయ ఉద్యోగులు అన్ని డివిజన్లలోనూ ఉన్నారు. ఐదేళ్ల క్రితం సచివాలయ ఉద్యోగులు ఎవరూ లేరు. అయినా ఉన్న ఉద్యోగులతో పన్నులు వసూలు చేసేవారు. నాటికి, నేటికి పెద్ద మార్పు మాత్రం కనిపించడం లేదు. ఉద్యోగుల సంఖ్య పెరిగింది తప్ప పన్నుల వసూళ్లలో పురోగతి కనిపించడం లేదు.

విజయనగరం నగర పాలక సంస్థలో ఏడాదికి వసూలు కావాల్సిన పన్నులు మొత్తం రూ.39 కోట్లు. మరో ఐదు రోజుల్లో 11 నెలలు పూర్తికానున్నాయి. మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటి వరకు వరకు రూ.39 కోట్లకు కేవలం రూ.17 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.22 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 11 నెలల్లో రూ.17 కోట్లు వసూలు చేసిన రెవెన్యూ శాఖ... మిగిలిన నెల రోజుల వ్యవధిలో రూ.22 కోట్లు వసూలు చేయగలదా? అంటే సందేహించాల్సిందే. గతంలో జనవరిలో సంక్రాంతి పండుగ పూర్తయిన వెంటనే పన్నుల వసూలు ముమ్మరం చేసేవారు. దీని కోసం ప్రత్యేకమైన చర్యలు తీసుకొని, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వసూలు చేస్తే సుమారుగా 80 శాతం వరకు చేరుకునేవారు. ఫిబ్రవరి నెల నాలుగు రోజుల్లో పూర్తికానున్నా, ఇంకా 50 శాతం కూడా వసూలు కాలేదు. ఇంకా పన్నుల వసూలు జోరందుకోలేదు.

విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాల నుంచి, మొండి బకాయిల కింద కోర్టు కేసుల కారణంగా వసూలు కావాల్సినవి రూ.10 కోట్లపైగా ఉంది. మొండి బకాయిలపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి వసూలు చేయాల్సి ఉంది. ఉన్న 35 రోజుల్లో వంద శాతానికి చేరుకోవడమంటే కష్టమేనని చెప్పాలి. ఇప్పటికైనా పన్నుల వసూలుపై శ్రద్ధ వహిస్తారో? లేదా ఇదే మందకొడి పద్ధతి కొనసాగిస్తారో వేచి చూడాలి.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం

పన్నుల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. వంద శాతం పన్నుల వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పన్నుల వసూలుపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు ప్రక్రియకు చర్యలు తీసుకున్నాం. పన్నుల వసూలు కోసం రెడ్ నోటీసులు సిద్ధం చేస్తున్నాం. ఉన్న కొద్ది సమయంలో పన్ను చెల్లింపుదారులను అందరినీ కలిసి వసూలు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. నగర ప్రజలు కూడా స్వచ్ఛందంగా వచ్చి పన్నులు చెల్లించాలి. ఎవరైనా పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తాం.

- ఎం.ఎం.నాయుడు, కమిషనర్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొబ్బిలి: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మున్సిపల్ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మోటర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వేగావతి నదిలో ఇన్ ఫిల్టర్ బావులు వద్ద నీరు నిల్వ ఉండేలా ఇసుక బండలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాండ్ బై మోటారు బాగు చేయాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఎఇలు రవికుమార్, సురేష్‌ను ఆదేశించారు. క్లోరినేషన్ బాగా చేయాలన్నారు.

స్పందన ఫిర్యాదుపై దర్యాప్తు

వేపాడ: మండలంలోని వేపాడ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 86/130లో గల భూ వివాద సమస్యను పరిష్కరించమని జిల్లా కలెక్టర్‌కి స్పందన విభాగంలో రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ తక్షణమే సమస్య పరిష్కరించాలని జిల్లా సర్వే విభాగానికి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో అధికారులు దర్యాప్తు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తహశీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా సర్వేయర్ టి. యజ్ఞేశ్వర రావు, జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ బిఎన్ఎస్ ప్రసాద్, మన్మధరావు, మండల సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా

బాడంగి: గ్రీన్ అంబాసిడర్లకు బకాయి ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. సిఐటియు నాయకులు ఎ.సురేష్ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు 6 నెలలకు పైగా జీతాలు బకాయి ఉన్నాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నుండి నిధులు వచ్చినప్పటికీ వీరికి జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో ఇఒపిఆర్‌డి స్పందించి ధర్నా వద్దకు వచ్చి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వకపోతే స్థానిక ఎంపిడిఒ ఆఫీస్ దగ్గర వంట వార్పు చేసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ ప్రారంభం

తెర్లాం: మండలంలోని రంగప్పవలస సచివాలయం పరిధిలోని ఎంఆర్ అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 గ్రామ వార్డు సచివాలయాల్లో ఆరోగ్య ఉప కేంద్రం, రైతు భరోసా కేంద్రాలు పూర్తయ్యాయని చెప్పారు. విద్యా వైద్యం, రైతన్నల గురించి నిరంతరం ఆలోచించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, జెఇ రాజశేఖర్, తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సర్పంచ్ లక్ష్మి, రంగప్పవలస సర్పంచ్ ఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందెం

వేపాడ: మండలంలోని సామలపల్లి గ్రామంలో వీరాంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఎడ్ల పరుగు పందెం ఉత్సాహభరితంగా సాగింది. ఈ పోటీలో మొదట విజేతగా నిలిచిన ఎడ్ల బండి యజమానికి రూ. 15వేలు, రెండో విజేతకు రూ.13వేలు, మూడు విజేతకు రూ. 10వేలు ఇలా ఎనిమిది మంది విజేతలకు డిసిసిబి చైర్మన్ వివి చినరామునాయుడు, సర్పంచ్ కోలా సతీష్, ఎంపిటిసి చేతులు మీదుగా నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కోలాటం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

10 కేజీల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: వాహన తనిఖీలలో భాగంగా 10 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ సిహెచ్ గంగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు నుంచి ఎస్ కోట వైపు వస్తున్న ఇద్దరు వ్యక్తులు బ్యాగులను తనిఖీ చేశారు. వారి నుండి 10 కేజీల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఒరిస్సా రాష్ట్రం, బలిమెల గ్రామానికి చెందిన శ్యామ్ సుందర్ నాయక్, శ్యామ్ ఖిల్లా అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

దళిత కూలీలకు పని కల్పించాలని వినతి

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామానికి చెందిన దళిత కూలీలు తమకు ఉపాధి పని కల్పించి ఆదుకోవాలని ఎంపిడిఒ ఎస్.రమణయ్యను కోరారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో కలసి తమ గోడు వినిపించుకున్నారు. ఏడాదిన్నర కాలం నుంచి తమ గ్రామంలో ఉపాధి పని సాగక నానా అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఏర్పడిన తగాదా వల్ల తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పని కల్పించి ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ సోమవారం వరకు తనకు టైం కల్పించాలని, పెద్దలతో మాట్లాడి సోమవారం నుంచి మీకు పని కల్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు గొల్ల ఈశ్వరరావు, టిడిపి నాయకుడు లాలం అర్జునరావు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ఇవిఎంలపై గిరిజనులకు అవగాహన

శృంగవరపుకోట: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు ప్రాధాన్యత, ఇవిఎంల వినియోగంపై జిల్లా ప్రజలకు విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని దారపర్తిలో సంచార వాహనం ద్వారా ఇవిఎంల వినియోగంపై గిరిజనులకు అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంత కావడంతో పెద్ద సంఖ్యలో గిరిజనులు నమూనా ఇవిఎంను వినియోగించి ఓటు వేశారు. ఇవిఎంలలో ఓటు వేసే విధానం, వివి ప్యాట్‌లు పనిచేసే పద్ధతిని బిఎల్ఓలు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

గుర్ల: రజకులను ఎస్‌సిలో చేర్చాలని ఉమ్మడి విజయనగరం జిల్లాల రజక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గండ్రేటి సింహాచలం అన్నారు. గుర్లలో ఆయన మాట్లాడుతూ 19 రాష్ట్రాలలో రజకులు ఎస్‌సి జాబితాలో ఉన్నారని, తెలుగు రాష్ట్రాలలో మాత్రం బీసీ కులాల్లో ఉన్నామని, పక్క రాష్ట్రం ఒడిస్సాలో కూడా ఎస్‌సి జాబితా లో ఉన్నారని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ తమ డిమాండ్‌ను నెరవేర్చడానికి హామీ ఇస్తే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలో సుమారు 15వేల మంది ఓటర్లు ఉన్నామన్నారు. రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలలో తమకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

నేరాలు ఘోరాలు

పుస్తెల తాడు చోరీ

భోగాపురం : జాతీయ రహదారిపై బస్సు కోసం నిల్చున్న ఒక మహిళ మెడలో నుంచి మూడు తులాల పుస్తెలతాడును చైన్ స్నాచర్స్ ఎత్తుకుపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. రావాడ గ్రామానికి చెందిన కనకల సూరమ్మ తన మనవరాలతో గురువారం మధ్యాహ్నం విశాఖపట్నం వెళ్లేందుకు హైవేపై అవనాం జంక్షన్ వద్ద బస్ కోసం వేచి చూస్తోంది. ఇంతలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి బైక్ పై వచ్చి ఆమె మెడలో ఉన్న 3తులాల బంగారం పుస్తెలతాడును తెంపేశారు. అప్పటికి అప్రమత్తమైన సూరమ్మ బైక్ వెనుక ఉన్న వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేసినా ఆమె కింద పడిపోయింది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ పెనుగులాటలో దొంగలకు చెందిన రెండు పుస్తకాలు కింద పడిపోవడంతో అవి లభించాయి. మనవరాలు కేకలు వేసినప్పటికీ చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో స్నాచర్స్ పారిపోయారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రవికుమార్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వేపాడ: మండలంలోని బొద్దాంలో వలస కూలీగా పనిచేస్తున్న మింది వీరబాబు (22) పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లూరి సీతారామ జిల్లా బోసరిపాడు గ్రామానికి చెందిన వీరబాబు వలస కూలీగా ఇక్కడకు వచ్చి పని చేస్తూ జీవన సాగిస్తున్నాడు. శుక్రవారం పురుగు మందు తాగి మృతి చెందినట్లు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఆటోను లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

భోగాపురం: రాజాపులోవ వంతెన కింద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. విజయనగరం నుంచి తగరపువలస వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టి ఆటో బోల్తాపడటంతో అందులో ఉన్న ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

మహిళలకు ఏదీ ఆసరా

- సొమ్ము కోసం బ్యాంకులు చుట్టూ తిరుగుతున్న మహిళలు
- పట్టించుకోని బ్యాంకులు, వెలుగు సిబ్బంది
- అధికారుల తీరుపై మహిళా సంఘాల ఆగ్రహం
- బటన్ నొక్కి నెల రోజులైనా ఖాతాలకు చేరని డబ్బులు

ప్రజాశక్తి- భోగాపురం

ఆసరా పథకం కింద మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నెలరోజులు అయినప్పటికి స్థానిక వెలుగు అధికారులు, బ్యాంకు అధికారుల తీరుతో ఆ సొమ్ము మహిళల వ్యక్తిగత ఖాతాలకు నేటికి జమకాలేదు. మండలంలోని కొన్ని బ్యాంకులు రేపుమాపు అంటు మహిళలను బ్యాంకులు చుట్టు తిప్పుకుంటున్నాయి. కాని వారి ఖాతాకు మాత్రం జమచేయడం లేదు. దీంతో మహిళలు అధికారులు, బ్యాంకుల తీరుపై మండిపడుతున్నారు.

ఆసరా పథకం కింద మహిళా సంఘాలకు గతనెల 23వ తేదీన ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. అనంతరం గత నెల 31వ తేదీన మండల కేంద్రమైన భోగాపురంలో మహిళా సంఘాలతో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలందరికీ ఆదేరోజు తీర్మానాల పుస్తకాలను సమావేశానికి తీసుకురావాలని చెప్పి ఆదేశించారు. దీంతో ఆ సమావేశానికి పెద్ద ఎత్తున మహిళలందరు హాజరయ్యారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులు మీదుగా 1055 డ్వాక్రా సంఘాలలోని 11,521 మంది మహిళలకు రూ.7.18కోట్లు రూపాయల చెక్కును అందజేశారు. చెక్కు అందించిన వెంటనే సొమ్ములు తమ ఖాతాల్లోకి పడిపోతాయని చాలా మంది మహిళలు ఆశపడ్డారు. కానీ ఇంత వరకూ ఎవరి



చెక్కును మహిళా సంఘాలకు అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(ఫైల్)

చేతికీ డబ్బు అందకపోవడంతో దీనికోసమేనా ఇంత ఆర్భాటం చేశారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

వచ్చేనెల ఇస్తామంటున్న బ్యాంకులు

గతనెల 31వ తేదీన తీర్మానాలు రాస్తే సంతకాలు చేస్తామని చెప్పిన వెలుగు సిబ్బంది అక్కడకి పది రోజులు తరువాత మహిళా సంఘాల ఒత్తిడితో తీర్మానాలు చేయడం ప్రారంభించారు. భోగాపురం గ్రామంలోని ఒక బ్యాంకులో సుమారు 300 గ్రూపులు ఉన్నాయి. తీరప్రాంతమైన ముక్కాం, చేపలకంచేరు, నందిగాం, రామచంద్రపేట, పెదకొండ్రాజుపాలెం, భోగాపురం పంచాయతీల్లోని మహిళలకు సంబంధించిన డ్వాక్రా సంఘాల లావాదేవీలు ఇక్కడ జరుగుతుంటాయి. ఈ బ్యాంకకు ఈనెల మొదటి వారం నుంచి మహిళా సంఘాల గ్రూపు లీడర్లు తీర్మానాలు ఇచ్చారు. అయినప్పటికి ఒక్కరికి ఖాతాలో కూడా ఆసరా సొమ్ము జమచేయలేదు. అంతేకాక వచ్చేనెల ఇస్తామంటు బ్యాంకకు వచ్చిన వారిని తిప్పి పంపిస్తున్నారు. వాస్తవానికి సంబంధిత వెలుగు సిబ్బంది కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో మహిళలు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు వేసి రోజులు గడుస్తున్నప్పటికి తమ ఖాతాల్లో వేసేందుకు ఎందుకు నిరాకిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. స్పందించపోతే ఆందోళన చేస్తామని పలు గ్రామాలకు చెందిన మహిళలు హెచ్చరిస్తున్నారు.

బ్యాంకులతో మాట్లాడాం

ఈ విషయం ఇప్పటికే నా దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత బ్యాంకు సిబ్బందితో మాట్లాడాను. రెండు, మూడు రోజుల్లో మహిళల వ్యక్తి గత ఖాతాలకు ఆసరా సొమ్ము వేస్తామని చెప్పారు.

- రమణ, వైకెపి ఎపిఎం, భోగాపురం

లేబర్ అధికారిని సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్న లేబర్ కమిషనర్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మి నేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం విశాఖపట్నం జేసిఎల్ వద్ద చర్చలు అని చెప్పి సిఐటియులో ఉన్న ఉద్యోగులు, కార్మికులతో చర్చికుండా యాజమాన్యం, తనకు అనుకూలంగా ఉన్న 4గురుతో చర్చలకు పిలవడంలో లేబర్ అధికారులు ఎవరు పక్షాన ఉన్నారో అర్థం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా లేబర్ కమిషనర్ మిమ్స్ యాజమాన్యానికి కొమ్ము కాయడం పై నిరశన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యగులు, కార్మికులు అందరూ ఒక తాటిపై వచ్చి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఐక్యంగా పోరాడుతున్నారన్నారు. యాజమాన్యం ఉద్యోగుల పక్షాన అలోచించి పరిష్కారం చేయాలన్నారు. మిమ్స్ యాజమాన్యం, లేబర్ అధికారులు నిర్వహించే చర్చలకు రాకుండా కార్మిక చట్టాలను, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తుందన్నారు. ఉద్యోగులను తల్లిదండ్రుల వలే చూసుకుటున్నాం అంటున్న యాజమాన్యం నేటికీ జనవరి నెల జీతం ఇవ్వకపోవడం పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని

ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న తమ్మినేని

ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే గ్రామాల నుంచి కుటుంబ సభ్యులతో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఉద్యోగులు మిరప నారాయణ, క్రోతు కాము నాయుడు, మహంతి నాగభూషణం, మధు, మూర్తి, రాంబాబు, గౌరీ, వరలక్ష్మి, రామకృష్ణ, బంగారునాయుడు, నాగేశ్వరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

షేర్ల జారీ పేరిట భారీ మోసం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ భూసేకరణలో షేర్ల జారీ పేరున భారీ మోసం జరిగిందని జిందాల్ నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం 4వ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జిందాల్ అల్యూమినా కర్మాగారం వస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో భూముల్ని జిందాల్‌కు అప్పగించామన్నారు. ఇందులో భాగంగా షేర్ల రూపేణా ధృవపత్రాలు యాజమాన్యం అప్పట్లో ఇచ్చిందని అవి ఇంగ్లీష్‌లో ఉండటం వల్ల చదువురాని కారణంగా తమకు అప్పట్లో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన షేర్ల ధృవీకరణ పత్రాలు సరిచూసుకోలేదని చెప్పారు. వాటిమీద పరిహారానికి బదులుగా బహుమానం అని పేర్కొని ఉందని, ఇది భారీ మోసమని జిందాల్ నిర్వాసిత రైతులు పేర్కొన్నారు. జిందాల్ అల్యూమినా కర్మాగారం వస్తుందనే ఉద్దేశ్యంతోనే తామంతా భూములు ఇచ్చామని,

కొనసాగిన జిందాల్ నిర్వాసితుల నిరసన

నిరసన తెలుపుతున్న రైతులు

ఇప్పుడు ఎంఎస్ఎంఇ పార్కు పేరిట జిందాల్ యాజమాన్యం వ్యాపారధోరణితో వ్యవహరించి తమ భూములను వేరే వాళ్లకు కట్టబెట్టడం తమకు సమ్మతం కాదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిందాల్ కంపెనీ నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసిత రైతుల విషయంలో భూసేకరణ చట్టం-2013 అమలు చేసి తమకు సత్వర న్యాయం చేయాలని కోరారు.

గిరిజనులకు వైసిపి ద్రోహం

ప్రజాశక్తి- బాడంగి

నకిలీ కుల ధృవ పత్ర అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చి నిజమైన గిరిజనులకు వైసిపి ద్రోహం చేస్తుందని, బోగస్ గిరిజనురాలు పాముల పుష్ప శ్రీవాణిని ఎమ్మెల్యేను చేసి ఉపముఖ్యమంత్రి పదవులు కట్టబెట్టి ఏజెన్సీ గిరిజనుల హక్కులను హరించిన దుష్ట ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఎస్,ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఎరుకల పాకాల గ్రామంలో ఆయన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విభజన అనంతరం రిజర్వేషన్ ప్రకారం 11 ఎమ్మెల్యే, 2 ఎంపి స్థానాలు గిరిజనులకు కేటాయించాలి కానీ విభజనకు ముందు లాగానే 7 ఎమ్మెల్యే, 1 ఎంపి ఉన్నారని గుర్తు చేశారు. అందులో కూడా బోగస్ ఎస్‌టిలను చేర్చి

సూపర్ సిక్స్ పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఈ దుర్మార్గ వైసిపి ప్రభుత్వం గిరిజనుల రాజకీయ హక్కులను హరిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజనుల్లో నెలకొన్న నిరుద్యోగాన్ని తరిమికొట్టి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి టిడిపి మాత్రమే కృషి చేయగలదన్నారు. అనంతరం గిరిజనులకు టిడిపి సూపర్ సిక్స్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలవలస గౌరు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబులను వినియోగించాలి: డిఇఒ

ప్రజాశక్తి- చీపురుపల్లి

బైజూస్ విషయ పరిజ్ఞానంలో 8,9 తరగతుల విద్యార్థులు తప్పనిసరిగా టాబ్‌లను వినియోగించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్ ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ప్రతీ విద్యార్థి పాఠశాలకు తీసుకు వచ్చే విధంగా చూడాలన్నారు. ఐఎఫ్‌పిలను ఉపయోగించి విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిఎఎల్ లేబ్‌ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు బోధన చేయాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం మండలంలో గల విజయరాంపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్ బుక్స్‌ను విద్యార్థులు రాసిన తరువాత ప్రతీ పేజీని ఉపాధ్యాయులు పరిశీలించి తప్పులుంటే సరిచేసి రిమార్క్ రాసిసంతకం చేయాలని సూచించారు. 1వ తరగతి చదువు

రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ

విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ నెంబర్లతో డిజి లాకర్‌ని ఓపెన్ చేసి ఎఫ్ఎ-3 మార్కును అందులో ఉండే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిఇఒ వెంట ఎంఇఒ బూసినాయుడు, డిసిఇబి బోర్డు సెక్రటరీ సన్యాసిరాజు, సిఆర్ఎంటి కంది రామకృష్ణ తదితరులున్నారు.

సూపర్ సిక్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- బొండపల్లి

టిడిపి మ్యానిఫెస్టోలో రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు కోరారు. శుక్రవారం బొండపల్లి గ్రామంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కెఎ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంతో బూత్ కన్వీనర్‌లు, నాయకులు ఇంటింటికి తీసుకువెళ్లారని ఇదే స్ఫూర్తితో నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు పట్ల ప్రజలకు మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఈ మేరకు పార్టీని బలోపేతం చేయవలసిన ఆవశ్యకత ఉందని కార్యకర్తలకు సూచించారు. నారా లోకేష్ ఎన్నికల శంఖారావం విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు గంట్యాడ శ్రీదేవి, పివివి గోపాలరాజు, బివి.రామ్‌జి, బండారు బాలాజీ, కోరాడ కృష్ణ, రాపాక అచ్చంనాయుడు, పెద్దింటి మోహన్, మిత్తిరెడ్డి వెంకటరమణ, కొండపల్లి భాస్కరరావు, బూడి అప్పలనాయుడు, అట్టాడ లక్ష్ము నాయుడు, మజ్జి మహేష్, బెజవాడ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని సొంపురం రోడ్డులో ఇటీవల నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను శంకుస్థాపన చేసిన భవనాలు తానే ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన 40ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏ ప్రభుత్వంలోనైనా ఇంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేయడం జరగలేదని చెప్పారు. రాష్ట్రంలో నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి కూడా చేస్తున్నామని, ఈ ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గమంతా మౌళిక వసతుల కల్పనలో భాగంగా 150 భవనాలను ప్రారంభించామన్నారు. స్థానిక నాయకులు అందరూ సహకరిస్తే పార్టీలకతీతంగా రామభద్రపురం పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక సాధికారత సాధించాలంటే మరలా జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, అందుకు అందరం కలిసి పనిచేయాలని అలాగే ఎమ్మెల్యేగా తనకు మరొక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్రశేఖర్, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, స్థానిక సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి వసంతుల తిరుపతి, బవిరెడ్డి చంద్రరావు, వైసిపి మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, జేసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, నాయకులు పత్తిగుళ్ళ ఏకనాథ్, డర్రు పైడిరాజు, నాగిరెడ్డి కామేశ్వరరావు, బొండపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నియోజకవర్గ పరిశీలకులుగా ఎమ్మెల్సీ

గజపతినగరం: నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులుగా ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబును నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహనరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పి.ఎస్.ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురేష్ బాబు నియామకాన్ని స్వాగతిస్తూ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, నియోజవర్గ ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు అభినందనలు తెలిపారు. సురేష్ బాబు నియామకం సంతోషదాయమని, ఆయన పరిశీలనలో పార్టీ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే అప్పలనరసయ్య ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

నిధులను సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- గంట్యాడ

ఆర్థికంగా సుస్థిరత సాధించడానికి నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు పథక సంచాలకులు సావిత్రి అన్నారు. శుక్రవారం వైకెపి కార్యాలయములో జరిగిన మహిళా సమైక్య ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. సమైక్య అధ్యక్షురాలు పొన్నాడ జనని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు ఆర్థికంగా సుస్థిరత సాధించడానికి నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. తద్వారా సభ్యుల జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈనెల 29వ తేదీన మార్చి 1, 2 తేదీలలో ఏపిఎం, ఏఎస్ కేంద్ర బృందం మండలం సమాఖ్య పనితీరును పరిశీలించడానికి వస్తుందని సభ్యులు

మాట్లాడుతున్న సావిత్రి

ఆర్థికపరమైన అంశాలతో పాటు సామాజికపరమైన అంశాలపై కూడా సమావేశాలలో చర్చించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అల్లి ఉమామహేశ్వరరావు, డిపిఎం జై శ్రీరాజ్ కుమార్, బంగారమ్మ, ఏపిఎం శ్రీనివాస్, ఏపిఎంఎఫ్ పిఒ విజయ్ కుమార్, శైలేష్, సీసీలు రామకృష్ణ, చిన్నబాబు, ముత్యాల నాయుడు, గౌరీశ్వరి, అచ్చమనాయుడు, గ్రామ సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు రావాలి : సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్రం అభివృద్ధి కావాలంటే చంద్రబాబు రావాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం రాబంద గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ అరాచక పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు ఇస్తామని మోసపూరితమైన మాటలు చెప్పి యువతను నిరుద్యోగులుగా చేసిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందని ఆమె దుయ్యబట్టారు. అనంతరం పట్టని సన్యాసిరావు తోపాటు వైసిపి నుంచి15 కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, సీనియర్ నేతలు గెద్ద అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, గొర్లె మునలినాయుడు, రెడ్డి ఎర్రన్నాయుడు, ఎస్ గురు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

వంగర: మండలంలోని కింజంగి ఆర్ఆర్ కాలనీకి చెందిన బెజ్జిపురం నూకంనాయుడు, బురిడీ సింహాలునాయుడు, బెజ్జిపురం అప్పలనాయుడు, వావిలపల్లి ఆదినారాయణతో పాటు మరికొంతమంది వైసిపిని వీడి టిడిపి నాయకులు బెజ్జిపురం ముకుంద నాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో శుక్రవారం చేరారు. వీరందరికీ మాజీమంత్రి, రాజాం నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కొండ్రు మురళీమోహన్ శ్యాంపురం గెస్ట్ హౌస్ వద్ద టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొచ్చ వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, మజ్జి గణపతి, బెజ్జిపురం రవి, పాడి రాంబాబు, చీమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కలిసిన వారితో ఇంచార్జి కోండ్రు మురళి

పోలింగ్ కేంద్రం మార్చొద్దంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అప్పాపురం ప్రాథమిక పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని 74లో పిసి3, ఏసి9 గల కేంద్రాలను మార్చవద్దంటూ గ్రామస్తులు తహశీల్దార్ రాములమ్మకు వినతి ద్వారా వేడుకున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అక్కడ పోలింగ్ కేంద్రం ఉందని ప్రస్తుతం మార్చడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రంపై ఎవరో తప్పుడు నివేదిక ఇచ్చి మార్చడానికి సిద్ధపడ్డారని అన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కేవలం పోలింగ్ కేంద్రానికి మాత్రమే పనికి రాదా అని ప్రశ్నించారు. అన్ని సౌకర్యాలు ఉన్న ఈ పోలింగ్ కేంద్రాన్ని గ్రామంలోనే ఉంచాలని కోరారు. ఒకవేళ పోలింగ్ కేంద్రాన్ని మారిస్తే ధర్నాకు సిద్ధంగా ఉన్నామని

మార్చొద్దంటూ ఫిర్యాదు చేసిన కేంద్రం ఇదే..

హెచ్చరించారు. ఈ విషయంపై తహశీల్దార్ రాములమ్మను ప్రజాశక్తి వివరణ కోరగా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అన్ని వసతులు ఉంటే జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు మేరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని మార్చమని అన్నారు. సమస్య ఉంటే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

పటిష్ట ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - రామభద్రపురం

రాబోయే సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్‌పి దీపికాపాటిల్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 15 చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, 4వేల మిలటరీ దళాల పర్యవేక్షణలో శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకొనే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం, సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఏ బూత్ వద్ద ఎంత మంది సిబ్బంది ఉండాలో నివేదిక ఇస్తామన్నారు. బెల్ట్ షాపులు నిరోధానికి తగిన చర్యలు

15 చెక్ పోస్టులు, 4వేల పారా మిలటరీ దళాలతో పర్యవేక్షణ: ఎస్‌పి దీపికా

చేపట్టామని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 4వేల మద్యం కేసులు నమోదు చేసామని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో ఫిర్యాదులు స్వీకరణకు ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని ఏమైనా సమస్యలు వుంటే ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. శాంతియుత పోలింగ్ కోసం బూత్ స్థాయిలో తమ సిబ్బంది అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.